ప్రజాశక్తి
శనివారం 26 జూలై 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఎన్నో కీలక పోరాటాలు..విజయాలు

◆ నేడు, రేపు సిఐటియు విశాఖ జిల్లా 13వ మహాసభ ◆ కంచరపాలెంలో అన్ని ఏర్పాట్లూ పూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక వర్గానికి చోదక శక్తిగా ఉన్న సిఐటియు విశాఖ జిల్లా 13వ మహాసభలు శని, ఆదివారాల్లో కంచరపాలెంలోని ఎం కన్వెన్షన్‌లో ఘనంగా జరుగనున్నాయి. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ మహాసభలకు వివిధ పరిశ్రమలు, రంగాలు, ప్రాంతాలకు చెందిన 270 మంది కార్మిక నాయకులు ప్రతినిధులుగా హాజరుకానున్నారు. ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి.నాగేశ్వరరావు, సిహెచ్. నర్సింగరావుల తోపాటు విశాఖ జిల్లా పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎస్.శర్మ, ఎ.అజశర్మ హాజరుకానున్నారు. సంఘం అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులూ పాల్గొనున్నారు.



సిఐటియు జిల్లా మహాసభలకు సిద్ధమవుతున్న వేదిక

సమర శీల పోరాటాలు

గడిచిన మూడేళ్లలో జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సిఐటియు నిరంతర పోరాటాలు నిర్వహించింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు, పోరాటాలు సాగాయి. వాటి నిర్వహణలో సిఐటియు అగ్రభాగంలో నిలిచి, కార్మికులకు అండగా ఉంది. ప్రధాని మోడీ విశాఖ పర్యటన సందర్భంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలిపింది. అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై 42 రోజులు, మున్సిపల్ కార్మికుల సమస్యలపై 17 రోజులు, సమగ్ర శిక్ష అభియాన్ కార్మికుల సమస్యలపై 23 రోజులు సమ్మెలు సిఐటియు నాయకత్వంలో జయప్రదంగా జరిగాయి. విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నెల రోజుల పాటు గేట్ వద్ద నిరసన దీక్షలు సాగాయి. యాజమాన్యం చర్చలు జరిపి జీతాలు పెంచుతూ అగ్రిమెంట్ చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. అన్యాయంగా తొలగించిన 300 మంది డెయిరీ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని తాజాగా సిఐటియు నాయకత్వంలో పోరాటం కొనసాగుతోంది. సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పోరాటం జరిగింది. నగరంలో జివిఎంసి, పోలీస్ అధికారులు తొలగించిన తోపుడుబండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలని నగర వ్యాప్తంగా ఆందోళనలు జరిగాయి. ఎక్కడ వారిని అక్కడ వ్యాపారం చేసుకునేటట్లు చేయగలిగింది. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల, 108, 104, 102 ఉద్యోగుల, సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలపై ధర్నాలు జరిగాయి. చంద్రబాబు ప్రభుత్వం తొలగించిన వాలంటీర్లు అందరినీ విధుల్లోకి తీసుకోవాలని నిరసన కార్యక్రమాలు సిఐటియు నేతృత్వాన మిగతా 2లో..



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఐటి పరిశ్రమలకు ప్రోత్సాహం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ, డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్ సంయుక్తంగా రెండు రోజులపాటు విశాఖ వేదికగా తలపెట్టిన ఫ్యూజన్ ఎఐ సమ్మిట్ - 2025 శుక్రవారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనా వేదికగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటి పరిశ్రమకు చక్కటి ప్రోత్సాహం ఇస్తున్నామని, ఇప్పటికే ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు విశాఖలో తమ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యాయని అన్నారు. ట్రంప్ వ్యాఖ్యల ప్రభావం కొంతవరకు భారతదేశం మీద కనిపిస్తోందని తెలిపారు. కానీ సానుకూల దృక్పథంతో వాటిని స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఐటి పరిశ్రమ అభివృద్ధి చెందే విధంగా నూతన ఐటీ పాలసీని రూపొందించామన్నారు. రాష్ట్రంలో నూతన ఎంఎస్‌ఎంఇ పార్కులను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మూడో దశ మెట్రోను భోగాపురం నుండి విజయనగరం వరకు నిర్మించాలని తాము కోరామన్నారు. అనంతరం ప్రముఖ ఐటి నిపుణులు విశాల్ ధూపర్ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ఐటి పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే ఎఐ ఆధారిత సంస్థలు ఇక్కడకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఎఐ అనుసంధానంతోనే రానున్న రోజుల్లో అన్ని పరిశ్రమలూ మిగతా 2లో..

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు పూర్తిగా కేంద్రమే నిధులివ్వాలి

▶ వార్త 2లో..

బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

▶ వార్త 3లో..

స్మార్ట్ మీటర్లపై అబద్ధపు ప్రచారం మానుకోవాలి

▶ వార్త 5లో..

నేడు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఛాంబర్ సమీపంలోని విసి.హాలు, అలాగే జెడ్‌పి సమావేశ మందిరంలో 1 నుంచి 7 వరకూగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 11 గంటలకు, 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, సంబంధించిన ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్ : విశాఖలో హైకోర్టు బెంచ్ తక్షణమే ఏర్పాటు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవాదుల సమస్యలపై విశాఖలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం ముఖద్వారం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నూతన న్యాయస్థానాల నిర్మాణం చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా న్యాయవాదులకు విశ్రాంతి గదులు కేటాయించాలన్నారు. న్యాయవాదులు మరణానంతర ప్రయోజనాలను రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ న్యాయవాదులకు రూ.10 వేల గౌరవ భృతి మిగతా 2లో..

పెన్షన్ రూల్స్ చట్ట సవరణలపై తీవ్ర నిరసన

విశాఖలో భారీ మానవహారం



విశాఖ నగరంలో భారీ మానవహారం చేపట్టిన పెన్షనర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు 2025లో భాగంగా సిసిఎస్ పెన్షన్ రూల్స్‌కు చేసిన సప్త సవరణలకు నిరసనగా ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వందలాది మందితో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెన్షనర్లకు పెన్షన్ పెంచకుండా ఎగ్గొట్టాలని చూస్తోందని తెలిపారు. అందులో భాగంగానే పెన్షన్ చట్టానికి సవరణలు చేసిందని తెలిపారు. ఈ సవరణ పెన్షనర్లను కొత్త, పాత అని విభజిస్తుందన్నారు. ప్రస్తుత పెన్షనర్లకు నష్టం కలిగిస్తుందని, పెన్షన్ రూల్స్‌కి ఏ మార్పులైనా, ఎప్పటినుంచైనా అమలుచేసే విశేష అధికారం ప్రభుత్వానికి దఖలు పరుస్తుందని అన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కి వ్యతిరేకమన్నారు. ఈ సవరణలకు వ్యతిరేకంగా పెన్షనర్లు, కార్మికులు ఉద్యమించాలన్నారు. ఎఐబిడిపిఎస్ జిల్లా కార్యదర్శి, ఫోరం చైర్మన్ కె.రామాంజనేయులు మాట్లాడుతూ ఈ చట్టం చెల్లుబాటుకు వ్యతిరేకంగా ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ సుప్రీం కోర్టులో కేసు వేస్తున్నాయన్నారు. లీగల్ చర్యలతో పాటు వివిధ రూపాల్లో నిరసనలూ తెలియజేస్తున్నామన్నారు. అనంతరం ఎసిజిఇపిఎ ప్రధాన కార్యదర్శి, ఫోరం కన్వీనర్ ఎం.చంద్రశేఖరరావు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎస్ఎం.మౌలాలి, పి.గోపాలకృష్ణ, కెవి.రామకృష్ణ, సంజీవరెడ్డి, అష్రఫ్, బి.సత్య నారాయణ, కె.సుధాకర్, వైఎస్ఎ.రావు, వరప్రసాద్, బాబూరావు, స్వామి తదితరులు మాట్లాడారు.

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, కె.రమాప్రభ తదితరులు మద్దతు తెలిపారు.

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు

పూర్తిగా కేంద్రమే నిధులివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు పూర్తిగా కేంద్రమే నిధులివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖ, విజయవాడ నగరాల మెట్రో రైలు నిర్మాణ తొలి దశ పనులకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఆమోదం తెలిపిందని, విశాఖ నగరంలో మొదటి దశలో చేపట్టనున్న 76 కిలోమీటర్ల మెట్రో రైలు పనులకు రూ.11,498 కోట్ల వ్యయమవుతుందని, దీనిలో ప్రభుత్వ జాయింట్ వెంచర్, ఈక్విటీ ఫండింగ్ సగం, సగం కింద చేపట్టనున్నట్లు ప్రకటించారని తెలిపారు. వాస్తవంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 కింద విశాఖ, విజయవాడ మెట్రో రైలు నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని, దానికయ్యే పూర్తి వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని తెలిపారు. కానీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దీనికి భిన్నంగా కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయి ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం భరించేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. ఈ చర్య రాష్ట్ర ప్రయోజనాలకు హానిచేసేదిగా ఉందన్నారు. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా వియంఆర్‌డిఎ రూ.4101 కోట్లు సమకూర్చాలని, ఆ నిధులను 1944 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించి సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. రైతుల భూములను, ప్రభుత్వ భూములను పెద్ద ఎత్తున ల్యాండ్ పూలింగ్ పేర రాష్ట్ర ప్రభుత్వం బడా సంపన్నులకు ధారాదత్తం చేయనుందని తెలిపారు. పర్యావరణం, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ నిబంధనలను కూడా తుంగలో తొక్కి కొండలను, సముద్ర తీరప్రాంతాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టనున్నారన్నారు. పర్యావరణ సమతుల్యాన్ని విధ్వంసం చేయటానికి ఈ చర్యలు దారితీయనున్నాయని విమర్శించారు. అంతేగాక మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణం కోసం 76 కిలోమీటర్ల పొడవునా వందల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంటుందన్నారు. దీనికి పరిహారంగా కేంద్ర ప్రభుత్వమే నిధులు భరించాల్సి ఉందని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం 2013 భూసేకరణ ద్వారా కాకుండా టిడిఆర్ రూపంలో నష్టపరిహారం ఇవ్వాలని నిర్ణయం చేయడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, మెట్రో రైలు ప్రాజెక్ట్ వ్యయం మొత్తం కేంద్రమే భరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇది కేంద్రం యొక్క బాధ్యతని తెలిపారు. అలాగే ల్యాండ్ పూలింగ్ ద్వారా వియంఆర్‌డిఎ రెండు వేల ఎకరాలు సేకరించే నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి..

ఎన్నో కీలక పోరాటాలు..విజయాలు

సాగాయి. మున్సిపల్ కార్మికుల జీతాలు పెంచాలని, వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సమ్మె కాలపు ఒప్పందాన్ని అమలు చేయాలని అనేకసార్లు టోకెన్ సమ్మెలు సహా మహా ప్రదర్శనలు, ధర్నాలను సిఐటియు నిర్వహించింది. దేశవ్యాప్తంగా కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన సమ్మెలు, సదస్సులు విశాఖలో జయప్రదమయ్యాయి. షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల జిఒలను సవరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలని అనేక పర్యాయాలు లేబర్ ఆఫీసు వద్ద ధర్నాలు నిర్వహించారు. ముఠా కార్మికులకు లోడింగ్, అన్‌లోడింగ్ కోసం పోరాడి యాజమాన్యాలతో అగ్రిమెంట్ చేయించుకుని ముఠా కార్మికులకు భరోసా కల్పించింది. ఆటో కార్మికులపై ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 21ని రద్దు చేయాలని, నూతన రోడ్డు రవాణా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, భారీగా పెంచిన అపరాధ రుసుముల మొత్తాన్ని తగ్గించాలని ఆందోళనలు జరిగాయి. మొత్తంగా ఈ కాలంలో విశాఖ జిల్లాలో కార్మిక వర్గం ఎదుర్కొన్నటువంటి అనేక సమస్యలపై పోరాటాలు, ఆందోళనలు, సమ్మెలు జయప్రదంగా జరిగాయి. ప్రభుత్వ రంగ సంస్థల్లో జరిపిన పోరాటాలు మరువలేనివి.

కార్మిక వర్గ ఐక్య పోరాటాలకు కషి

గత మూడేళ్లలో సిఐటియు నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలపై మహాసభలో సమీక్షిస్తాం. భవిష్యత్తులో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు ఈ మహాసభలో తీర్మానాలు చేస్తాం. వాటి అమలు కోసం కృషి చేస్తాం. అదే సందర్భంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకోనున్నాం.

ఆర్‌కెఎస్‌వి.కుమార్,
సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఐటి పరిశ్రమలకు ప్రోత్సాహం

పనిచేస్తాయని తెలిపారు. కావున విద్యార్థులు కూడా ఎఐ ఆధారిత కోర్సుల్లో శిక్షణ పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఎపిడిఐటి నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు మాట్లాడుతూ వచ్చే పదేళ్లలో ఎఐ టెక్నాలజీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాలంటే ఇప్పటినుండే అవగాహనా నైపుణ్యం పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ క్రమంలోనే ప్రజలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించేందుకు రెండు రోజులపాటు సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు 1200 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకొని హాజరవుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎపిఎన్‌ఆర్‌టి సొసైటీ అధ్యక్షులు రవి వేమూరు, ఎస్‌టిపిఐ అడిషనల్ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

కల్పించాలన్నారు. విశాఖలో రైల్వే ట్రిబ్యునల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎంఎస్.భగవతి, జిజెఆర్.అజయ్ కుమార్, ఇందిర, డి.శైలజ, పి.మాధురి, వేణు సుబ్రహ్మణ్యం, జి.సుశీల, విఆర్.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

దండు నాగేశ్వరరావుకు సతీవియోగం


రాధాభాయి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ బాక్సర్, ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు దండు నాగేశ్వరరావు సతీమణి రాధాభాయి (71) శుక్రవారం సాయంత్రం 7.30 గంటల సమయంలో కన్నుమూశారు. ఆమె పార్థివ దేహాన్ని చిన వాల్తేరు జంక్షన్ మెయిన్ రోడ్డులో (మసీదు దగ్గర) అభిలాష్ అపార్టుమెంట్‌లో సందర్శనార్థం ఉంచారు. నాగేశ్వరరావు ప్రముఖ జాతీయ బాక్సర్, ప్రజానాట్య మండలి, సిపిఎం సీనియర్ నాయకులు. ఆయన ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కల్చరల్ కార్యక్రమాల బాధ్యతలు చూస్తున్నారు. రాధాబాయి గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆమె ఉమ్మడి రాష్ట్రంలో మొదటి జాతీయ మహిళా బాక్సింగ్ రిఫరీగా సేవలందించారు. వారికి ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి ఉన్నారు. అందరూ జాతీయ స్థాయి బాక్సర్లు. రాధాభాయి కొంత కాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. పరిస్థితి విషమించి శుక్రవారం మరణించారు. ఆమె మృతికి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు సంతాపం తెలిపారు.

శిశు శస్త్ర చికిత్స విభాగానికి పరికరాల వితరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈసై ఫార్మాస్యూటికల్స్ కంపెనీ తరుపున ఆ సంస్థ ప్రతినిధులు జోసెఫ్, మదన్ మోహన్ శుక్రవారం కింగ్ జార్జి ఆసుపత్రి శిశు శస్త్ర చికిత్స విభాగానికి రూ.14 లక్షల విలువైన పరికరాలను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ఎం.సంధ్యా దేవి, కింగ్ జార్జి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, డాక్టర్ జె.భాస్కర్ రెడ్డి ఈసై ఫార్మాస్యూటికల్స్ కంపెనీ వారిని అభినందించారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో

ఉచిత యోగా శిక్షణా తరగతులు ప్రారంభం


యోగా శిక్షణకు హాజరైన వారు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉచిత యోగా శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు బుజ్జి ఈ ఉచిత యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి భమిడిపాటి సావిత్రి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని, ప్రస్తుత కాలమాన పరిస్థితులలో యోగా ఒక మంచి మార్గమని చెప్పారు. నేడు అందరిలో మధుమేహం, రక్తపోటు, హృదయ సంబంధిత వ్యాధులు, మూత్రపిండాల వ్యాధులే కాకుండా మానసిక రుగ్మతలు విపరీతంగా వస్తున్నాయన్నారు. వ్యాధి వచ్చిన తరువాత కాకుండా నివారణ మార్గం అనేది సరైనదని తెలిపారు. యోగాతో అటువంటి వ్యాధులను తగ్గించుకోవచ్చున్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ సిహెచ్. నర్సింగ రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రజా సేవకు అంకితమై పనిచేస్తోందన్నారు. ఈ కేంద్రంలో ఉచిత కుట్టు శిక్షణ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, బాల బాలికలకు నాలెడ్జ్ పెంచే కార్యక్రమాలు, యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నామని, దానితోపాటు ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిరోజు ఉచిత వైద్యం, నెల నెలా మెడికల్ క్యాంపుల నిర్వహణ చేపడుతున్నామన్నారు. వాటికి యోగా తోడై ప్రజలు మరింత ఆరోగ్యవంతంగానూ, శారీరక మానసిక బలాన్ని పెంచే విధంగానూ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.గంగారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని కైలాసపురం, సత్యసాయి నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నాలుగో పట్టణ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఆదేశాలతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 15 వాహనాలను సీజ్ చేసినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి నగరపాలెం గ్రామ సచివాలయానికి చిప్పాడ దివీస్ సంస్థ కంప్యూటర్, ప్రింటర్‌ను శుక్ర వారం వితరణగా అందజేసింది. గ్రామ పెద్దలు పొట్నూరు చంద్రశేఖర్, రాము తదితరుల సమక్షంలో దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, శేఖర్‌బాబు, పైడినాయుడు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు దివీస్ పార్కులో వ్యాయామశాల, గొల్లలపాలెం పాఠశాల వరకు వీధిదీపాలకు విద్యుత్‌స్తంభాలు, లైట్లు ఏర్పాటుకు రూ.3,67,008 ఆర్థికసాయం డిడిని గ్రామపెద్దలకు అందజేశారు

'ప్రకృతి' సాగుపై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని తర్లువాడ పంచాయతీ నగరపాలెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయి అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయ విధానంపై మూడు రోజుల శిక్షణలో భాగంగా శుక్రవారం రెండోరోజున క్షేత్రప్రదర్శన నిర్వహించారు. రైతులను నేరుగా కలుసుకుని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల శాస్త్రీయత, ప్రయోజనాలు, ఎదురవుతున్న అనుభవాలు, సవాళ్ళపై చర్చలు జరిపారు. సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రకతి వ్యవసాయ విభాగం డిపిఎం అల్లం మోహనరావుపాల్గొన్నారు

ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం: విద్యా భారతి ఆధ్వర్యంలో బెంగళూరులో జరుగుతున్న జోన్‌ల్‌స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో గుడిలోవ విజ్ఞాన విహార్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రన్నరప్‌గా నిలవడం ద్వారా అండర్-14 విభాగంలో ముగ్గురు, అండర్ 17 విభాగంలో ఇద్దరు అఖిల భారతస్థాయి పోటీలకు అర్హత సాధించారని పిఇటి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ దూసి రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

దళిత హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి -ములగాడ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీతోపాటు ఇతర దళిత చట్టాలు, హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం డిహెచ్‌పిఎస్ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో 63వ వార్డుకాకర్లలోవ భగత్ సింగ్ జంక్షన్‌లో జిల్లా సమితి సమావేశం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగే డిహెచ్‌పిఎస్ ఐదో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. దళితుల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు టి కామేశ్వరరావు, వై కనకేశ్వరరావు, గాలి సాంబమూర్తి, సురేష్ పాల్గొన్నారు,

గీతంలో ఘనంగా విజేతల దినోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 1507 మందికి పైగాఉద్యోగాలు సాధించడంతో పాటు ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యాభ్యాసానికి ప్రవేశార్హత సాధించారని గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా అన్నారు. శుక్రవారం వర్సిటీలో విజేతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 300కి పైగా ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు గీతం ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, ఫార్మశీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పించాయన్నారు. ఇంజనీరింగ్‌లో అత్యధిక వార్షిక వేతనం రూ. 34 లక్షలు కాగా ఎంబిఎలో రూ. 11 లక్షలు, సైన్స్‌లో రూ.7.3 లక్షలు, ఫార్మశీలో రూ.4.లక్షలు, హ్యూమానిటీస్‌లో రూ. 3.6 లక్షల వార్షిక వేతనంతో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని అభినందించారు.

ఈ సందర్భంగా ఎటి అండ్ ఎన్‌టి సంస్థ హెచ్‌ఆర్ డైరెక్టర్ ప్రగతికుమార్ అచంటా మాట్లాడుతూ గీతం సాధిస్తున్న విజయాలను ప్రతి ఒక్కరూ



ఉద్యోగ పత్రాలు అందుకుంటున్నగీతం విద్యార్థులు

గమనిస్తున్నారని, నాణ్యత ప్రమాణాలలో గీతం ప్రగతి స్ఫూర్తిదాయకమన్నారు. కృత్రిమ మేధ యువతకు కొత్త సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.. గీతం ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు మాట్లాడుతూ, ఉద్యోగాల కల్పనలో గీతం వర్సిటీ అగ్రగామిగా ఉందన్నారు. గీతం ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగం కృషికి పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి



బాధితులతో మాట్లాడుతున్న వైసిపి నేత చిన్న శ్రీను

ప్రజాశక్తి- పద్మనాభం.: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని వైసిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం భద్రయ్యపేట గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతోనూ, వ్యాధిపీడితులను పరామర్శించి, వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో అందుతున్న వైద్యసేవలపై రేవిడి పిహెచ్‌సి డాక్టర్ లీలాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఇరవై ఏళ్లు దాటిన వారికి వైద్యపరీక్షలు చేస్తున్నామని డాక్టర్ చెప్పగా, అందరికీ వైద్యపరీక్షలు చేయాలని, దూరాన ఉన్న కెజిహెచ్‌కు కాకుండా దగ్గరలో ఉన్న తగరపువలసలోని ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో అవసరమైన పరీక్షలు చేయించాలని, అవసరమైతే దీనిపై జిల్లా కలెక్టర్‌తో తాను మాట్లాడతానన్నారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, సమస్యలన్నీ సద్దుమణిగిపోతాయని భరోసానిచ్చారు.కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్ గిరిబాబు, రెడ్డిపల్లి ఉపసర్పంచ్ ఎస్ ఆదిబాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాంకేతికతతో మహిళాభివృద్ధి

ప్రజాశక్తి ములగాడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించడానికి టెక్నాలజీని వినియోగించుకోవాలని జెఎన్‌టియు.విజయనగరం రిజిస్ట్రార్ ఆచార్య జి. జయసుమ అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఫ్రెషర్స్ డే, సెయింట్ ఆన్స్ ఫీస్ట్ సాంస్కృతికోత్సవంలో మాట్లాడుతూ, మహిళల రక్షణ, సాధికారితకు కృత్రిమమేథతోపాటు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కె.సంజీవరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటిని సాకారానికి నిరంతరం శ్రమించాలని, నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఆత్మవిశ్వాసంతో,



బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్ జయసుమ

సానుకూల దృక్పథంతో కష్టపడి విజయాన్ని కైవసం చేసుకోవాలన్నారు.కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లీన్,పాల్గొన్నారు విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఫీస్ట్‌లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు'



కరపత్రాలను పంచుతూ ప్రచారంలో ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు టిడిపి ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగడ రాజారావు ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్‌లో సుపరిపాలన తొలి అడుగులో ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్ళి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు పరిచిన పథకాలు, భవిష్యత్‌లో అమలు చేయబోయే పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసారు. పథకాలు అందని లబ్దిదారుల జాబితాను, స్థానిక సమస్యలను యాప్ ద్వారా నమోదు చేసుకున్నారు కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, నాయకులు మూది అప్పారావు, కృష్ణంరాజు, పేపర్ నాయుడు, లింగం సత్య నారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు జెవి.అగ్రహారంలో స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టిడిపి నాయకులతో కలిసి ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, త్రినాథ్ కుమార్, గొలగాని నరేంద్రకుమార్, జి ఎల్లయ్య పాల్గొన్నారు.

గాజువాక.: జివిఎంసి 70వ వార్డు ఎల్‌బి.నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు టిడిపి నాయకులు బొడ్డేటి రమణ, శంకరరావు, ఉరుకుటి అప్పారావు, సూరిశెట్టి అప్పలరాజు, మల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని చిప్పాడలో టిడిపి నాయకులు కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, రాజాన రమేష్ కుమార్, పీలా తులసీరాము రాజాన రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.75వేల జరిమానా విధిస్తూ బాలబాలికల లైంగిక కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పైడి మంగకుమారి శుక్రవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాదారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

కేసులో బాధితురాలి తరపున వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్‌ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి. అల్లూరిజిల్లా పెదబయలు మండలం చెరువువీధికి చెందిన నిందితుడు కొర్రా రంజిత్ కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను 2020 అక్టోబర్ 13న నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను వారి ఇంటి వద్దకు చేర్చాడు. అయితే రక్తస్రావమౌతున్న బాలికను గుర్తించిన తల్లిదండ్రులు స్థానిక పిహెచ్‌సికి తీసుకెళ్లి వైద్యం చేయించడంతోపాటు ఆరా తీయడంతో జరిగిన ఘోరం తెలిసింది. వెంటనే గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా నేరాన్ని ఒప్పుకున్న నిందితుడు పరారయ్యాడు. దీనిపై బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి పాడేరు డిఎస్‌పి బివి.రాజ్‌కమల్ కేసు దర్యాప్తు చేపట్టి, నేరాభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఈ మేరకు తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని, నిందితుడికి జరిమానాగా విధించిన రూ.75వేలను కూడా బాలికకు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ :గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి.

దాడిశెట్టి గిరిధర్, పండవ ప్రేమ్ కుమార్, బూసి నరేష్ కుమార్, డెంగల సన్ని బాబు శనివారం మధ్యాహ్నం విశాఖ వేలీ స్కూలు పక్కన గల నీలగిరి తోటలో గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రామదాసు, మరికొంత సిబ్బంది మాటు వేసి వారిని పట్టుకున్నారు. నిందితులను నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని సిర్లపాలెం గ్రామంలో మద్యం అక్రమ విక్రయాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేశారు.అక్రమంగా మద్యం నిల్వచేసి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక ఎస్ఐ శివ ఆధ్వర్యంలో దాడుల చేసి కెల్ల గౌరీ, బల్లంకి బంగార్రాజు నుంచి 162 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిందితులను భీమిలి కోర్టులో హాజరుపరచగా, వచ్చేనెల 7 వరకు రిమాండ్ విధించారు.

తగరపువలస : అధికారిక దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకు మద్యం కొనుగోలు చేసి, ఇంటి వద్ద అధికధరకు విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం భీమిలి పోలీసులు పట్టుకున్నారు. సిఐ తిరుమలరావు కథనం ప్రకారం, విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, గుడివాడ గ్రామానికి చెందిన చిల్లతోగుల రెడ్డి 27 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా, అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా పున్నమి రెస్టారెంట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డాడు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ జి.హరీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదుల్లో 'యు' ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : తరగతి గదుల్లో విద్యార్థులను 'యు' ఆకారంలో కూర్చొబెట్టి విద్యాబోధనకు చర్యలు చేపట్టాలని బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాష్ కోరారు. శుక్రవారం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా నరవ ప్రకాష్ మాట్లాడుతూ ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలని కోరనున్నట్లు తెలిపారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ, పరిశీలించి, అమలుకు కృషి చేస్తామన్నారు.

నూతన ఆవిష్కరణలతో అభివృద్ధి



పిహెచ్‌డి స్కాలర్లను అభినందిస్తున్న గణబాబు

ప్రజాశక్తి-సీతమ్మధార: పరిశోధనలతో నూతన ఆవిష్కరణల ద్వారా అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. శుక్రవారం వాల్తేర్ క్లబ్ పెరల్‌హాల్‌లో ఎయు న్యాయశాస్త్రం విభాగం నుంచి పిహెచ్‌డి పొందిన డాక్టర్ ఆడారి కిషోర్‌కుమార్, గీతం యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో పిహెచ్‌డి పొందిన డాక్టర్ ఐఎల్ఎన్ ప్రసాద్‌లను స్థానిక ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ ఫోరం పిల్లా రాజు ఆధ్వర్యంలో అభినందించి, మెమెంటోలను అందజేశారు విశాఖ సిటిజన్ ఫోరం పీలా నీల తిలక్, రాపేటి గోవింద, ఎయు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-గోపాలపట్నం : నిరుద్యోగులకు నైపుణ్యశిక్షణనిచ్చి వారికి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. శుక్రవారం జివిఎంసి 57వ వార్డు కాగితా పైడయ్య కల్యాణమండపంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతూ, ప్రభుత్వ కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపికలు చేశారు. కార్యక్రమంలో ఎపి స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరరావు, కార్పొరేటర్లు శరగడం రాజశేఖర్, ముర్రు వాణి నానాజీ, పెంటకోట ఆజయ్‌బాబు, కార్తీక్ కుట్టా, దాసరి శివ, మడక గౌరి, మహేంద్ర, రాంబాబు పాల్గొన్నారు.

ఎంపిపి నిధులతో ఎనిమిది బోర్లు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలో ఎంపిపి మజ్జి శారద ప్రియాంక కోటా మండల పరిషత్ నిధులతో మండలంలో 8 బోర్‌వెల్స్ ఏర్పాటు చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసినట్లు ఎంపిపి తెలిపారు. భీమన్న దొరపాలెం రామాలయం వెనుక, ఎస్‌సి కాలనీ శ్మశానవాటిక వద్ద, రామవరం పశువుల ఆసుపత్రి, కణమాం పంచాయతీ కార్యాలయం, యర్రవాణి పాలెం, అయ్యవారి కణమాం (జగనన్న కాలనీ), కోలవానిపాలెం పశువుల ఆసుపత్రి, తర్లువాడ పంచాయతీ నగరపాలెం రామాలయం వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

బోరువెల్ ఏర్పాటు

ఆనందపురం: మండలంలోని తర్లువాడ నగరపాలెం గ్రామంలో రామాలయం వద్ద మండల పరిషత్ నిధులు రూ.2లక్షలతో బోర్‌వెల్, మోటర్, పైపులైన్ ఏర్పాటు పనులను సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, టిడిపి మండల అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, బంకు రాజు, ఉపసర్పంచ్ పిల్లా సూరిబాబు, పిల్లా అప్పల నాయుడు, చిన్నారావు, బోయిన ఆనంద్ పాల్గొన్నారు

హామీల అమలులో మోసం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్నికల హామీల అమలులో సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ప్రజలను మోసపుచ్చిందని వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు అన్నారు. శుక్రవారం అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతూ మోసపూరిత హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేశారన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు తరుణ్ కుమార్ గోపి కన్నప్ప పాల్గొన్నారు.

పిఎసిఎస్ సభ్యురాలిగా మీనాక్షి

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ పిఎసిఎస్ సభ్యురాలిగా జనసేనకు పోతిన మీనాక్షికి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల నియామక పత్రం అందించి, అభినందించారు. కార్యక్రమంలో బివి కృష్ణయ్య, శాఖర శ్రీనుబాబు, 7 వ వార్డు అధ్యక్షులు నాగోతి నరంహా నాయుడు, పిళ్లా శ్రీను, పేకెటి శ్రీను, పోతిన తిరుమలరావు, సతీష్, కె.శంకర్, గంగరాజు, నాని పాల్గొన్నారు

క్లాప్ వాహనాలకు
పార్కింగ్ స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి- కొమ్మాది : క్లాప్ వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని క్లాప్ వాహనాల డ్రైవర్ల సంఘం, సిఐటియు మధురవాడ అధ్యక్ష,కార్యదర్శులు కె.సన్ని, ఎం.రాజు కోరారు. శుక్రవారం మారికవలస రాజీవ్‌గృహ కల్ప కళ్యాణ మండపం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లాప్ వాహనాలు మొదట్లో సాయిప్రియా లేఅవుట్ రహదారి ప్రక్కన శ్మశాన స్థలంలో పెట్టేవారమని, తరువాత అక్కడ నుండి ఖాళీచేయించి ద్రోణంరాజు కళ్యాణ మండపం ఆవరణలో పెట్టించారన్నారు. .ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో క్లాప్‌వాహనాలను నిలుపుతుండగా, వాహనాలను బయటపెట్టించి, కల్యాణమండపాల గేట్లకు. జోనల్ కమిషనర్ తాళాలు వేయిస్తున్నారని ఆరోపించారు. రాజీవ్ గృహ కల్ప నీళ్ల ట్యాంకుల దగ్గర స్థలం చూపిస్తే దానిని మున్సిపల్ ప్రొక్లెయినర్‌తో చదును చేయించామని, అక్కడి నివాసితులు క్లాప్ వాహనాల పార్కింగ్‌ను అడ్డుకుంటున్నారన్నారు. దీంతో క్లాప్‌వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియడం లేదని, జివిఎంసి యంత్రాంగం శాశ్వత పార్కింగ్ స్థలం చూపించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజు కుమార్, బి అప్పలరెడ్డి, పి.అశోక్, ప్రసాద్, రాము పాల్గొన్నారు



సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

27న బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన

ప్రజాశక్తి- సీతమ్మధార : బుద్ధిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ఈనెల 27న సాయంత్రం 5.30గంటలకు నగరంలోని బుల్లయ్య కాలేజ్ దరి అంబేద్కర్ భవన్‌లో ప్రదర్శించనున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షుడు బత్తుల గౌతంబాబు తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ భవన్‌లో మీడియా సమావేశంలో నాటక ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ లతారాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, 40మంది అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు నాటకాన్ని ప్రదర్శిస్తున్నారని, విశాఖ వాసులు ఉచితంగా తిలకించి, జయప్రదం చేయాలన్నారు. బుద్ధుని జీవిత చరిత్రతో పాటు బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరమనే అంబేద్కర్ ఆలోచనలను ఈ నాటకంలో చక్కగా తీర్చిదిద్దారని తెలిపారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు,. ప్రధాన కార్యదర్శి జెవి. ప్రభాకర్,. సొసైటీ జిల్లాఉపాధ్యక్షురాలు బీర రత్నకుమారి, కార్యదర్శి కె. సత్యనారాయణ, బి. ఉమామహేశ్వరి, కె.వెంకటేశ్వరరావు, పి.తిరుమల కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

భద్రయ్యపేటలో కొనసాగుతున్న వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లీలా ప్రసాద్

ప్రజాశక్తి -పద్మనాభం: కిడ్నీ వ్యాధులు ప్రబలిన మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ భద్రయ్యపేట గ్రామంలో రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ లీలా ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం కొనసాగింది. భద్రయ్యపేటలోపాటు సమీపంలో ఉన్న గ్రామాల్లో కూడా ఆశావర్కర్ల ద్వారా ఇంటింటా సర్వే చేయించి, వ్యాధి లక్షణాలున్న, అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ లీలాప్రసాద్ మాట్లాడుతూ, ముందుగా 20ఏళ్ల పైబడిన వారందరికీ అవసరమైన అన్ని పరీక్షలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసరావు మురళి తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం


ప్రజాశక్తి- సీతమ్మధార : దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రతతోపాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ .పి.జగదీశ్వరరావు సూచించారు. శుక్రవారం కొబ్బరితోట యుపిహెచ్‌సి పరిధిలోని నేవల్ క్యాంటీన్ ఏరియాను సందర్శించి, డ్రైడే ఫ్రైడే, ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సందర్శనలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



నీటి నిల్వలపై సూచనలు చేస్తున్న డిఎంహెచ్ఒ

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -భీమునిపట్నం : నాలుగో వార్డు కె నగరపాలెం, నరసింహనగర్‌లో జివిఎంసి నిధులు రూ 77.55 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రెయిన్లు, కల్యాణ మండపాల అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. జెడిసి బమ్మి అయ్యప్పనాయుడు, తహశీల్దార్ పైలా రామారావు, టిడిపి వార్డు అధ్యక్షులు పాసి నరసింగరావు, పార్టీ మండల అధ్యక్షులు డి ఎ ఎన్ రాజు, నాయకులు పాసి త్రినాథ్ కుమార్, జి ఎల్లయ్య, గొలగాని నరేంద్ర కుమార్, ఎం సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

1625వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న దీక్షలు 1625 రోజుకు చేరుకున్నాయి. శుక్రవారంరిలే నిరాహార దీక్షల్లో స్టీల్ సిఐటియు ప్రతినిధులు స్టీల్ సిఐటియు నాయకులు ఆర్ వెంకట్రావు, జగ్గారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.భానుమూర్తి మాట్లాడుతూ ఇప్పటికే ఎస్ఎంఎస్‌లో 100 హీట్లకు పైబడి ఉత్పత్తి జరుగుతోందని, అలాగే బ్లాస్ట్ ఫర్నేస్‌లో 6 వేల టన్నులు ఉత్పత్తి జరుగుతున్న యాజమాన్యం కార్మికులను ప్రోత్సహించడంలో అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు. కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించి ఆర్థికంగా ఆదుకోవడం యాజమాన్యం కనీస కర్తవ్యమన్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన ఏర్పాట్లను యాజమాన్యం చేపట్టాలని కోరారు.

నేడు ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - ఆరిలోవ : బదిలీ పూర్తయ్యి రెండు నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల పొజిషన్ ఐడిలు రాకపోవడంతో జీతాలు అందలేదని, అంతేకాక బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోతున్నాయని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, అంబేద్కర్ అన్నారు. దీన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం 5 గంటలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టబోయే నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఫుట్‌బాల్ టోర్నీకి భార్గేష్ ఎంపిక



కోలా భార్గేష్

ప్రజాశక్తి -తగరపువలస : మధ్యప్రదేశ్ బాలాఘాట్‌లో ఈ నెల 26న జరుగనున్న అండర్ 16 బాలుర ఆలిండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు భీమిలి కి చెందిన కోలా భార్గేష్ ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. గత నెల మదనపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో సత్తాచాటి, జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై చినబాబుతోపాటు పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

అప్పలనాయుడుకు ఘననివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : పెందుర్తి గౌరీసంఘం భవనంలో శుక్రవారం మాజీ మంత్రి, మాజీ ఎంపీ ఎస్ఆర్ఎస్ అప్పలనాయుడు 29వ వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైసిపి అనకాపల్లి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షులు శరగడం చిన్న అప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎస్ శీను, ఎపి నాయుడు, రమేష్, గౌరీ సేవా సంఘం అధ్యక్షులు వేగి పరమేశ్వరరావు, శరగడం అప్పారావు, గౌరీ సేవా సంఘ మాజీ అధ్యక్షులు శరగడం సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో విఎంఆర్‌డిఎ ఛైర్మన్

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ శుక్రవారం దర్శించుకున్నారు.ఆయనకు ఆలయ డిప్యూటీ ఇఒ సింగం రాధా, ఎఇఒ కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వదించగా, ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

స్మార్ట్ మీటర్లపై అబద్ధపు ప్రచారం మానుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్మార్ట్ విద్యుత్ మీటర్లపై ప్రభుత్వం, అధికారులు అబద్ధపు ప్రచారం మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో హితవుపలికారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి బిగిస్తున్న స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ బిల్లులు పెరగవని, ఎటువంటి ఇబ్బంది ఉండదని, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారుల ద్వారా ప్రచారం చేయిస్తుందని తెలిపారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా ప్రభుత్వం మభ్యపెడుతోందని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తుంటే బిల్లులు ఎక్కువ వస్తున్నాయి... బాదుడే బాదుడు.... అని వాటిని పగలగొట్టండని యువగళంలో లోకేష్ ప్రకటించిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని, విద్యుత్ బిల్లులు పెరగవని, రూపాయికే విద్యుత్తు ఇవ్వవచ్చని డాంబికాలు పలికి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్‌ను బిగిస్తోందని తెలిపారు. స్మార్ట్ మీటర్ వలన ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులు భారీగా పెరిగినట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, దీనిపై విద్యుత్ శాఖ మంత్రి రవికుమార్ కూడా స్పందించి బిల్లులు పెరిగిన మాట వాస్తవమే అని ఒప్పుకున్నారని, ఇది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటరుకు ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే పగలు ఒకరేటు, రాత్రి ఒక రేటు వసూలు చేస్తారని చెప్పారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు కొనుగోలుకు రూ.25వేల కోట్లు విద్యుత్ శాఖ అదానీకి చెందిన షిరిడి సాయి ఎలక్ట్రికల్ కంపెనీకి ఇచ్చిందని, ఈ భారం ప్రజలపైనే వేస్తున్నారని తెలిపారు. బాగా పనిచేస్తున్న మీటర్లు ఎందుకు తొలగించాల్సి వస్తుందో అధికారులు ప్రజలకు వివరించాలని హితవుపలికారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో కార్పెంటర్ షాపుకి అదనంగా బిల్లు వచ్చిందని, ఆటోమేటిక్‌గా పవర్ సప్లై కూడా తొలగించారని తెలిపారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఒక చిన్న షాపుకి రూ.64 వేలు విద్యుత్ బిల్లు వచ్చిందన్నారు. వ్యవసాయం మోటార్లకు 23 వేలు బిల్లు వస్తుందని ఇది వాస్తవమా?.. కాదా? అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పేరుతో గత సంవత్సర కాలంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్లు భారాలు మోపిందన్నారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలు కట్టబెట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలలో భాగంగా ఈ స్మార్ట్ మీటర్లు బిగింపు అని పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలి తప్ప అబద్ధపు ప్రచారం ప్రభుత్వం విద్యుత్ అధికారులతో చేయించడం సరికాదన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు.

ఇవిఎం గోదాముల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈవీఎం గోదాముల వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. నెలవారీ తనిఖీలో భాగంగా శుక్రవారం జిల్లా ఎస్‌పి కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా, డిఆర్ఓ వై సత్యనారాయణరావు, వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేసి సీసీ కెమెరా పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్. వెంకటరమణ, జిల్లా ఎన్నికల విభాగం, సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెస్ , ఆప్, సి.పి.ఎం పార్టీల ప్రతినిధులు బి. శ్రీనివాసరావు, ఉగ్గిన అప్పారావు, జే. రమేష్, కె. వి. మారియో, కె.హరినాథ్ బాబు, ఆర్.శంకరరావు, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు సహకరించాలి

ప్రజాశక్తి-మునగపాక : అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో విస్తరణలో భాగంగా నూతన బ్రిడ్జి నిర్మాణం వలన తమ కట్టడాలను కోల్పోతున్న నలుగురు నిర్వాసితులకు శుక్రవారం చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా కుంటుపడిన రోడ్డు విస్తరణ పనులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రారంభం కావడం శుభపరిణామన్నారు. రైతులందరూ విస్తరణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ షేక్ అయిషా, ఎమ్మార్వో సత్యనారాయణ, ఎంపిడిఓ ఉషారాణి, పలు శాఖలకు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-వడ్డాది : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు నాయకులు ఎస్‌వి.నాయుడు, పినపాత్రుని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్టలో ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. ఏడు వారాలుగా ఉపాధి హామీ కూలీల డబ్బులు ఇవ్వడం లేదని కూలీలు తెలిపారు. దీంతో కుటుంబాలను పోషించుకోకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లోపూడి పంచాయితీ పరిధి బంగారు మెట్ట గ్రామంలో సుమారు 10 గ్రూపులకు 7 వారాల నుండి డబ్బులు ఇవ్వటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

నిర్వాసితులను మోసం చేయడం తగదు



నినాదాలు చేస్తున్న కృష్ణం పాలెం ఎస్ఇజెడ్ నిర్వాసితులు

ప్రజాశక్తి-రాంబిల్లి : నిర్వాసితులకు ఇప్పుడున్న జీవితం కన్నా మెరుగైన జీవనం కల్పిస్తామని చెప్పి, దానిని అమలు చేయకుండా ఇప్పుడు మీటింగ్ పేరు చెప్పి భయభ్రాంతులకు గురి తప్పుడు సంతకాలు చేయించుకొని నిర్వాసితులను మోసం చేయడం తగదని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు అన్నారు. రాంబిల్లి మండలం, కృష్ణపాలెం ఎస్ఇజెడ్ నిర్వాసితులను శుక్రవారం ఆయన కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ అధికారులు, భూములను, గ్రామాన్ని, 2006లోనే ఎస్ఇజెడ్ కోసం అతి తక్కువ ఖరీదుకు ఎకరాకు రూ. ఐదున్నర లక్షలు ఇచ్చి తీసుకున్నారని తెలిపారు. నేడు ఇక్కడ ఎకరా 23 లక్షలు పలుకుతుందని, చాలా నష్టపోయామని నిర్వాసితులు అంటున్నారని పేర్కొన్నారు. నేటికీ 18 సంవత్సరాలు పూర్తయిన ఇప్పటికీ ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం చేయలేదన్నారు. నిర్వాసితులకు ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో లాటరీ పద్ధతిలో ఇళ్లు కేటాయించడం సరికాదన్నారు. దీని వల్ల గ్రామానికి ఒకే చోట కాకుండా, కుటుంబాలను, అన్నదమ్ములను, పిల్లలను కూడా విడగొట్టి చెట్టుకొకరు పొట్ట కొకరు అన్నట్లు చేయడం సరికాదని పేర్కొన్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించే వరకు, జీవన భృతి నిమిత్తం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, పిల్లల విద్యకు స్కూలు నిర్మాణం చేపట్టాలని, ఆటలకు క్రీడా మైదానం నిర్మించాలని, కమ్యూనిటీ హాల్ కట్టించాలని, స్మశాన స్థలం కేటాయించి ప్రహరీ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఖరీఫ్ రైతాంగానికి అవసరమైన పూర్తిస్థాయిలో సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అనకాపల్లి, యలమంచిలి, వి మాడుగుల శాసనసభ్యులతో, నీటిపారుదల శాఖ, వ్యవసాయశాఖ అధికారులతో జిల్లా సాగు నీటి పారుదల సలహా మండలి సమావేశం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ జలాశయాల నుండి సాగు నీరు విడుదల చేయుటకు తేదీలు ఖరారు చెయ్యడం జరిగిందని తెలిపారు. జులై 25న కోణం, పెద్దేరు రిజర్వాయర్ ప్రాజెక్టుల నుండి, జులై 29న రైవాడ రిజర్వాయర్ నుండి, ఆగస్టు 8న తాండవ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నుండి, ఆగస్ట్ 12 న వరాహ రిజర్వాయర్ నుండి సాగు నీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నీటి పారుదల శాఖ పర్యవేక్షణ ఇంజనీర్ స్వర్ణ కుమార్, కార్యనిర్వహణ ఇంజనీర్ ఎ. త్రినాధ్, నర్సీపట్నం ఆర్డీఓ వి వి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, జిల్లా ప్రణాళిక శాఖ అధికారి జి రామారావు, జలవనరుల శాఖ ఇంజనీర్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు, ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

దోబీఖానా ఆక్రమణపై రీ సర్వే చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులోని రజకులకు చెందిన ధోబీఖానా ఆక్రమణ గురైందని, దాన్ని మరోసారి రీ సర్వే చేసి ఖీబీకాన ఆక్రమణ గురికాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షులు తోకాడ రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు మాడుగుల నియోజకవర్గ రజక సంఘం ఇన్చార్జి కొడమంచిలి శంకర్రావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ ఎం భుజంగరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీనివాసరావు నియోజకవర్గ అధ్యక్షులు గురుమూర్తి, రజక సంఘం సభ్యులు కోటపాడు అప్పారావు, కోటపాడు సింహాచలం కోటపాడు మహాలక్ష్మి, తాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు సన్యాసినాయుడు (బాబీ) పాల్గొని టీడీపీ శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. అర్జీలను పీలా గోవింద సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.



ఎస్‌పి తుహిన్ సిన్హాను కలిసిన ప్రొబేషనరీ ఎస్‌ఐలు

పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు శాఖ ప్రతిష్టను పెంచడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో బేసిక్ శిక్షణ పూర్తిచేసి, గ్రేహౌండ్స్ విభాగంలో కమాండో శిక్షణ, కర్నూలులో వివిధ రకాల ఆయుధాలతో శిక్షణ పొందిన నలుగురు ప్రొబేషనరీ సబ్ ఇన్స్‌పెక్టర్లు జిల్లాకు బదిలీ అయ్యారు. వారు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సేవా దృక్పథంతో, నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడం వల్లే పోలీసు శాఖ ప్రతిష్ట మరింత పెరుగుతుందన్నారు. ప్రొబేషనరీ ఎస్సైలు క్షేత్ర స్థాయిలో విధులకు సన్నద్ధంగా తయారవ్వాలన్నారు. ఎస్సైలు కె.పోషణ గౌరి, ఎన్.విజయకుమారి, షేక్ షాహిబా అంజుమ్, జి.కమల భార్గవ్‌లతో గంటకు పైగా చర్చిస్తూ, వారు చదువుకున్నది, శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్సైలు కె.పోషణ గౌరి, ఎన్.విజయకుమారి, షేక్ షాహిబా అంజుమ్, జి.కమల భార్గవ్ పాల్గొన్నారు.

2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని పాటిపల్లి రెవిన్యూ సర్వేనెంబర్ 79 నుండి 212 వరకు సేకరిస్తున్న భూనిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు తోటాడ పంచాయతీలో గల రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరిస్తున్న భూములు ఏ పరిశ్రమల పెడుతున్నారో అనే విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. కాలుష్య కారకమైన పరిశ్రమలను ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేశారు. పరిశ్రమలకు సేకరించే భూములకు పక్కనే నివాసాలు ఉన్న విషయాన్ని పరిశీలించాలన్నారు. పట్టాదారులకు, సాగుదారులకు, ప్రతిరైతుకు న్యాయం చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. చెట్లకి కూడా పరిహారం చెల్లించాలని కోరారు. కొలతలు పూర్తయిన తర్వాత ప్రతి గ్రామంలోనూ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఆళ్ల.మహేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

విఎస్.అచ్యుతానందన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కె.కోటపాడు : కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్ సంతాప సభ శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. ముందుగా అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కులు, భూసంస్కరణలు, సామాజిక న్యాయం కోసం జీవితకాలం పోరాడిన యోధుడు అచ్యుతానందన్ అని పేర్కొన్నారు. 8 దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో మచ్చలేని నాయకుడిగా విఎస్ నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడు బాబు, నాయకులు ఎర్ర దేముడు, టిసిఎస్ అధ్యక్షులు కండిపల్లి సహదేవుడు. ఏ కోడూరు టిసిఎస్ అధ్యక్షులు శెట్టి రమణ, కడవల వెంకటేష్, బండారు మరిడి సత్యం తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు



భూ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా సర్వేయరు

గెడ్డవాగు ఆక్రమణపై జిల్లా సర్వేయర్ దర్యాప్తు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ ప్రభుత్వ గెడ్డవాగు భూమిని దురాక్రమణ చేసిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సిఎం దాష్ బోర్డు నుండి అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా సర్వేయర్ ఎస్.గోపాల్‌రాజు శుక్రవారం ఇరువాడ పంచాయతీ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 103, 106లలో ఈ ఆక్రమణలను పరిశీలించారు. గెడ్డవాగు ఆక్రమణపై తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు బలిరెడ్డి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

పి4 విధానంపై కూటమి నేతలకు అవగాహన

ప్రజాశక్తి, అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ వార్డులో కొండ కొప్పాక, కొత్తూరు నరసింగరావు పేట, సిరసపల్లి, సాలాపువానిపాలెం, తాడి సచివాలయాల్లో కూటమి నేతలకు పి4పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రాన్ని అందించాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిరసపల్లి సన్యాసిరావు, సాలాపు మోహన్, కసిరెడ్డి సత్యనారాయణ, వానపల్లి బాబురావు , బోయిన మురళి, జనసేన దుర్గాప్రసాద్, మజ్జి శ్రీను నాయకులు పాల్గొన్నారు.

వర్షంతో వరి నారుకు ఊపిరి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వర్షాలు లేక ఎండిపోయే స్థితికి వచ్చిన వరి నారు, ఇటీవల కురిసిన వర్షాలకు ఊపిరిపోసుకున్నాయి. కొద్ది రోజుల క్రితం వర్షాల కురవకపోవడంతో వరి నారుమడులను రక్షించుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు. వ్యవసాయ మోటార్ల ద్వారాగా, బావుల ద్వారా నీటిని తోడి తడిపారు. మరి కొంతమంది రైతులు మంచి నీటి ట్యాంక్‌ల ద్వారా నీటిని పెట్టి నారు మడులను కాపాడు కున్నారు. అయితే వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో సమస్యలు, పొరపాట్లు, అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల నేతలు తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యన్నారాయణ రావు సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం తమ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో మాసాంతపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతోనే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంటు ఎస్.ఎస్.వి. నాయుడు, తెలుగుదేశం, బి.జె.పి, వైసీపీ, ఆప్ పార్టీ, సి.పి.ఎం పార్టీల ప్రతినిధులు బి. శ్రీనివాసరావు, జె.రమేష్, కె.హరినాథబాబు, ఆర్ శంకర రావు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైతులు శ్రమదానంతో పంటలకు కాలువల్లో పూడికతో పనులు శుక్రవారం దేవరపల్లి కొల్లివారి కళ్ళల వద్ద నుంచి చేపట్టారు. ఇందులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూములు దమ్ములు పట్టడానికి నీరు అవసరమని పంట కాలువలు తుప్పలతో పూడికతో నిండి ఉండడంతో నీరు పూర్తిస్థాయిలో అందడం లేదని అందుచేత రైతులమంతా శ్రమదానంతో కాలువ శుభ్రం చేశారు.



పంట కాలువలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

28న పాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి -అచ్చుతాపురం రోడ్డు విస్తరణలో భూములు, ఇల్లు, షాపులు కోల్పోతున్న నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు కాకుండా నగదు రూపంలో పరిహారం చెల్లించాలని కోరుతూ ఈనెల 28న హరిపాలెం నుండి అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వరకు జరిగే పాదయాత్రలో నిర్వాసితులంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట, మునగపాక, ఒంపోలు, నాగులపల్లి గ్రామాలలో శుక్రవారం సిపిఎం నాయకులు సందర్శించి నిర్వాసితులతో సమావేశమై సంతకాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా మునగపాకలో జరిగిన కార్యక్రమంలో కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు గ్రామసభలు నిర్వహించి నగదు రూపంలో పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఈరోజు వీఎంఆర్‌డిఏ ద్వారా టిడిఆర్ బాండ్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం మాట మార్చడం దుర్మార్గమన్నారు. టిడిఆర్ బాండ్లు వద్దని బాధితులంతా ఒకే మాటగా చెబుతున్నప్పటికీ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని నోటిఫికేషన్ విడుదల చేసి ఇప్పుడు టిడిఆర్ బాండ్లు ఇస్తామనడం నిర్వాసితులు మోసం చేయడమే అవుతుందన్నారు. టిడిఆర్ బాండ్ల వల్ల ఒరిగేది ఏమీ లేదన్నారు. దీనివలన నిర్వాసిలంతా రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎవరెన్ని మాయ మాటలు చెప్పినా నమ్మకుండా పరిహారం కోసమే నిర్వాసిలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్ రాము, కో- కన్వీనర్ రామసదాశివరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, నాయకులు ఎస్ బ్రహ్మాజీ, కూండ్రపు సోము నాయుడు, ఎస్ కన్నమునాయుడు, బుద్ధ రంగారావు, బాబురావు, ఆడారి శ్రీనివాస్ నాయుడు, బొడ్డేడ సూరిచంద్రరావు, కాండ్రేగుల నాయుడు, కడారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

రసాయన పరిశ్రమల్లో

రక్షణ వ్యవస్థలను నిత్యం పర్యవేక్షించాలి

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

రసాయన కర్మాగారాల లోపల, వెలుపల కూడా రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు, జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ ఛైర్పన్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టరు అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫ్యాక్టరీలలో ఏర్పాటుచేసిన రక్షణ వ్యవస్థలపై సమీక్ష చేసారు. ఫ్యాక్టరీ లోపల, వెలుపల రసాయనాలు లీకేజీలను గుర్తించే సెన్సార్లను అమర్చాలని తెలిపారు. జిల్లాలో గల అన్ని రసాయన కర్మాగారాలలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఫ్యాక్టరీలలో అమర్చిన రక్షణ పరికరాలకు జాతీయ సేఫ్టీ కౌన్సిల్ ఆమోదం ఉండాలని తెలిపారు. కంపెనీలలో మెషిన్ హ్యాండ్లింగ్, రసాయన పదార్థాలు వాడకంలో శిక్షణ పొందిన కార్మికుల చేతనే పనిచేయించాలని, కాంట్రాక్ట్ వర్కర్ల చేత చేయించకూడదన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఫార్మా ప్రతినిధులకు ఆదేశించారు. రసాయనాలను రవాణా చేసే వాహనాలకు కూడా రసాయనాల లీకేజీలను గుర్తించే సెన్సార్లు అమర్చాలని జిల్లా కలెక్టరు తెలిపారు. కర్మాగారాలలో ప్రమాదాల జరగకుండా రక్షణకు సంబంధించిన అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని, ఆన్ సైట్, ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ ప్లాన్లు తయారు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ సత్యనారాయణ రావు, రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇనస్పెక్టర్ కె. పరమేశ్వరరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.కె.పి ప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లంకెలపాలెం జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలు అరికట్టాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని లంకెలపాలెం జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని, రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం లంకెలపాలెం జంక్షన్‌లో సిఐటియు ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం లంకెలపాలెం జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాల నివారించడానికి కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. అధిక లోడుతో ప్రయాణిస్తున్న బొగ్గు లారీలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రాజేష్, దీపు, వరుణ్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు, కార్మికులు

వీఎంఆర్‌డిఏ అధికారులపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి-ప్రజాశక్తి రూరల్ : జిల్లా కేంద్రంలోని రైతులు మోసం చేసిన వీఎంఆర్‌డిఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చెర్లోపల్లి ఆవఖండంలో 58 ఎకరాలు అభివృద్ధి కోసం తీసుకొని పెడచెవిన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. 19 ఏళ్ల పాటు ఎన్నో ఒడిదుడుకులు తర్వాత రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో ఆమోదముద్ర వేసిందన్నారు. ప్రభుత్వ ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేశారు. అప్పటి వీఎంఆర్‌డిఏ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఈ భూములపై ఆమోదం తెలపమని కోరగా కొంతమంది మధ్యవర్తులతో మూడు కోట్లు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఈమెపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి : జూన్ నెలలో జరిగిన బదిలీలలో భాగంగా అనకాపల్లి మండలం మామిడిపాలెం జడ్పీ హైస్కూల్ నుంచి జిల్లాలో వేరువేరు ప్రాంతాలకు బదిలీ అయిన ఆరుగురు ఉపాధ్యాయులను శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హెచ్‌బి శ్రీధర్ ఉపాధ్యాయుల సేవలు కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పట్టాభి, ఇందుకూరి ఉమా, పువ్వుల స్వామి, లంబ గౌరీ, కామేష్, శైలజలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. బదిలీ చెందిన ఉపాధ్యాయులు పాఠశాలకు వారి జ్ఞాపకార్థం ఎలక్ట్రిక్ బెల్ కుర్చీలు, గోడ గడియారం బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాబు, గొంది చిన్నబ్బాయి, సుబ్బారావు, రమణి, వసంతరావు, కరుణ జ్యోతి, జి.లక్ష్మి, ఆడారి లక్ష్మిసుజాత, జగదీశ్వరి, శ్రీను, ఆచార్యులు, నారాయణ రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-అచ్చుతాపురం : అచ్చుతాపురం అనకాపల్లి రహదారి విస్తరణ బాధితులకు శుక్రవారం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు అనకాపల్లి ఆర్డీవో ఆయేషా చేతులు మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. శరగడం మురళి, పద్మ, కాండ్రేగుల జోగేశ్వరరావు తదితరులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు వేసిన అంచనాలకు మించి రెట్టింపు విలువతో పేమెంట్లు ఇచ్చామన్నారు. డిటి శ్యామ్ పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

ప్రజాశక్తి- అచ్చుతాపురం : అచ్యుతాపురం పంచాయతీ కోణెం పాలెం గ్రామంలో బిర్యానీ పాయింట్లలో పనిచేస్తున్న మైనర్ బాలికపై గురువారం రాత్రి పది గంటల సమయంలో అసభ్యకరంగా ప్రవర్తించినందున ముస్తఫా అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ నమ్మి గణేష్ తెలిపారు. బిర్యానీ పాయింట్‌లో పనిచేస్తున్న మైనర్ బాలికను రూము క్లీన్ చేయడానికి పిలిచి ఆమెపై అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కసింకోట -బంగారు మెట్ట రోడ్డులో రాత్రి సమయాలలో వాహనాల ప్రమాదాలకు గురికాకుండా రోడ్డు సేఫ్టీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో మధుములు, చిన్న చిన్న వంతెనలు, మలుపులు అనేకం ఉన్నాయి. గత కొద్ది రోజులుగా వాహనాల రద్దీ ఈ రోడ్డులో ఎక్కువగా ఉండటంతో పలు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ఈ రోడ్డులో మధుములు, వంతెనలు మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.



ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-కోటవురట్ల: హరిజన, గిరిజన ఇళ్లపై పీఎం సూర్య ఘర్ సోలార్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఇంజనీర్ పరమేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం హరిజన, గిరిజనులకు 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే.వీరి ఇళ్ళపై 3కిలోవాట్స్ లేదా 6 కిలోవాట్స్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

పి 4 సర్వేపై నిర్లక్ష్యం చేయకండి


ప్రజాశక్తి -నర్సీపట్నం: ప్రజల జీవన స్థితిగతులపై నిర్వహిస్తున్న పి 4 సర్వేను నిర్లక్ష్యం చేయకుండా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని శుక్రవారం కార్యాలయంలో కౌన్సిల్ వార్డు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ సురేంద్ర అన్నారు, వాస్తవ విశ్లేషణతో కూడిన పూర్తి సమాచారాన్ని సేకరించాన్నారు.సర్వేను యాదృచ్ఛికంగా నిర్వహించకుండా పూర్తిస్థాయిలో గృహాలను పరిశీలించి వెరిఫై చేయాల్సిన బాధ్యత పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రధానంగా విద్య వైద్యం ఆరోగ్యం, తాగునీటి పథకాల తో పాటు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయంపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కఈ ార్యక్రమంలో మేనేజర్ రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం

బంగారు కుటుంబాల ఎంపికపై గ్రామసభ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని ఎర్రవరం గ్రామంలో శుక్రవారం బంగారు కుటుంబాలను ఎంపిక చేయడంపై గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపిఎం కరుణానిధి మాట్లాడుతూ, కనీస అవసరాలకు నోచుకోని కుటుంబాల వివరాలను ఈ గ్రామసభల ద్వారా గుర్తించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. గ్రామసభలో గుర్తించిన వారందరికీ ప్రభుత్వం ద్వారా అందించే వివిధ పథకాల్లో అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సత్కరిస్తున్న నాయకులు

తహశీల్దార్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-రావికమతం: ఇటీవల నూతనంగా నియమితులైన రావికమతం మండల తహసిల్దారు అంబేద్కర్‌ను శుక్రవారం రావికమతం మండల జనసేన పార్టీ అధ్యక్షులు మైచర్ల నాయుడు ఆధ్వర్యంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ మండలంలో రెవిన్యూ పరమైన పలు సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గెంజి శ్రీనివాసరావు, సూరిబాబు, రామనాయుడు, భూషణం, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి -మాడుగుల: జలాశయాలు అంటే ఆధునిక దేవాలయాలతో సమానమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మండలంలో జాలంపల్లి శివారు రాయిపాలెం వద్ద ఉన్న తెన్నేటి విశ్వనాథం జలాశయం నుండి శుక్రవారం ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సాగునీటిని విడుదల చేసే కార్యక్రమంను చైర్మన్ అద్దేపల్లి జగ్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో చివరి సంవత్సరంలో నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టలేదన్నారు. సంబంధిత మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి 69 కోట్లు రూపాయలు నిధులు మంజూరుకు జీవో విడుదల చేయించడం జరిగిందన్నారు.ఈ జలాశయం కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 19 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉందని. పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరు అందలేదన్నారు. ఖరీఫ్ కాలం ప్రారంభం కావడంతో నవంబర్ డిసెంబర్ నెల నుంచి పనులు ప్రారంభం చేసి త్వరతగతిన పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఉరకగడ్డ జలాశయం వరి ఆయకట్టుకు నీరు అందడం లేదని, దీనికి కాలువ తవ్వడానికి రైతుల భూములు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. రేటు ప్రకారం భూములకు డబ్బులు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు రైతులను ఒప్పిస్తే సుమారుగా 13 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, జడ్పిటిసి కిముడు రవణమ్మ, ఎంపీపీ తాళ్లపరెడ్డి వెంకటరాజారాం, ఉప చైర్మన్ అర్లి గోవిందా, త్రినాథ్ పాల్గొన్నారు.



నీటి విడుదలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు, చైర్మన్ తాతయ్యబాబు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి -మాడుగుల: పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని శుక్రవారం డ్రై డే కార్యక్రమం ముంకుదపురం, పోతనపూడి అగ్రహారం, గొట్టివాడ అగ్రహారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు, వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని కాలువలలో పూడిక తీత, మంచినీటి వనరులు శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య, ఆశ, అంగనవాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక అల్లూరి సీతా రామరాజు డిగ్రీ కళాశాలలో డీఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నషా ముక్త భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు మత్తు పదార్థాలైన గంజాయి, మధ్యంకు, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు ఎంతో అనర్థాన్ని తీసుకొస్తాయన్నారు. ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలను అధిరోహించడమే ధ్యేయంగా విద్యనభ్యసించాలని తెలిపారు. తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, సమాజం పట్ల మహిళ పట్ల గౌరవంగా మెలగాలని తెలియజేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలనీ అతి వేగంగా బండిని నడపవద్దన్నారు. లోన్ యాప్స్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా జాబ్ ఇప్పిస్తామని, డబ్బులు కట్టమని చెప్పినా నమ్మవద్దని తెలిపారు.

చిక్కాల రామారావుకు సత్కారం

ప్రజాశక్తి - పాయకరావుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ ఛైర్మన్, వైసిపి పాయకరావుపేట మండల అధ్యక్షులు చిక్కాల రామారావును శుక్రవారం ఉదయం తుని రైల్వేస్టేషన్ లో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఘనంగా సత్కరించారు. చిక్కాలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెంటకోట సర్పంచ్ చేపల తాతాజీ, మాసాహేబుపేట సర్పంచ్ గెడ్డమూరి శ్రీనివాసరావు, పెంటకోట ఉప సర్పంచ్ చిక్కాల సూర్యనారాయణ (బాబు), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యజ్జల సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకులు నల్లబిల్లి సత్యనారాయణ, పల్లెల వెంకట్, పాలపర్తి సతీష్ , గేదెల చిన అప్పలరాజు, కాకాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చిక్కాలకు సత్కరిస్తున్న వైసిపి నేతలు

29న నక్కపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 29వ తేదీ మంగళవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి సీతారామరాజు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరవ్వాలన్నారు.



పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో దేవవరం గ్రామం లో శుక్రవారం ఎంపీడీవో డి సీతారామరాజు పర్యటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో ఉపాధి శ్రామికులు చేపడుతున్న పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు సూచించారు. ప్రతిరోజు తడి పొడి చెత్తను ఇంటింటా సేకరించి సంపద తయారీ కేంద్రాన్ని తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలన్నారు.



చైర్మన్‌ను సత్కరిస్తున్న నేతలు

హైస్కూల్ ఛైర్మన్‌గా మణి

ప్రజాశక్తి: రావికమతం: మండలంలో చినపాచీల జడ్పీ హైస్కూల్ నూతన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గా బంటు మణి, వైస్ చైర్మన్‌గా కరణం ఈశ్వరరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైస్కూల్ నూతన విద్యా కమిటీ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. ఆనాడు ఎన్నికైన చైర్మన్ కుమార్తె 10వ తరగతి పాస్ అయ్యి వెళ్లడంతో ఆయన పదవిని కోల్పోయారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు వైస్ చైర్మన్ గా విధులు నిర్వహిస్తున్న బంటు మణి ఇన్చార్జ్ చైర్మన్గా వ్యవహరించారు. నేడు నూతన కమిటీ ఎన్నిక నిర్వహించడంతో మణిని చైర్మన్ గాను, సభ్యుడుగా ఉన్న కరణం ఈశ్వరరావును వైస్ చైర్మన్ గాను ఎన్నుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండ టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, ఎంపిటిసి, మాజీ కోపరేటివ్ అధ్యక్షులు కోన పరదేశి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

సులభ్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో కొత్తకోట గ్రామ పంచాయతీ పరిధిలో పలు ప్రదేశాలలో సులభ్ కాంప్లెక్షలను ఏర్పాటు చేయాలని పంచాయతీ పాలకవర్గం నిర్ణయం చేయడం జరిగిందని సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ తెలిపారు. వీటి నిర్మాణంకు గ్రామంలో పలుచోట్ల శుక్రవారం స్థల పరిశీలన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ, కొత్తకోట గ్రామం మేజర్ పంచాయతీ కావడం, గ్రామ జనాభా అధికంగా ఉండడంతో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రణాళిక తయారు చేయడం జరిగిందన్నారు. మర్రివలసకు వెళ్లే రహదారి, కన్నంపేట రహదారి, విద్యుత్తు సబ్ స్టేషన్కు, మార్కెట్ యార్డ్ వెనుక, మెయిన్ రోడ్డు బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండలం ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పూడి దేవ, ఏఈ భగవంతురావు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జ్యోతిష్య రెడ్డి పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలేదీ ?

ప్రజాశక్తి-గొలుగొండ:ప్రభుత్వం ప్రవేశపెట్టిన బంగారు కుటుంబం పథకం ఓ మాయ కుటుంబమని, అందులో ఉన్న నియమాలు, నిబంధనలు అధికారులు సమావేశాల్లో వివరిస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని గొలుగొండ వైస్ ఎంపీపీ, మండల వైసీపీ మహిళా అధ్యక్షురాలు జక్కు నాగమణి ఎద్దేవా చేశారు. ఎన్నో మాయ మాటలు చెప్పి మోసం చేసి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు ప్రభుత్వం ఇంకను ప్రజల్ని మభ్య పెట్టడం మోసం చేయడం అలవాటుగా మారిపోయిందని ఆమె ఆరోపించారు. బంగారు కుటుంబ పథకానికి ఎంపిక కావాలంటే, ఏ విధమైన పథకాలు తీసుకోకుండా ఉండాలని, మంచినీటి కుళాయి కూడా ఉండకూడదన్నారు. అటువంటి దిన స్థితిలో ఉన్నటు వంటి వారికే ఈ పథకం వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారని నాగమణి అన్నారు. అటువంటి అవకాశం నేడు సమాజంలో ఉన్నదా అని ఆమె ప్రశ్నించారు. జగనన్న వలె పథకాలు అమలు చేయాలన్నారు.ఎన్నికల హామీల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామలను అమలు చేయాలన్నారు.



పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో కొత్తకోట గాంధీ నగరంలో గల సోషల్ వెల్ఫేర్ హాస్టల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారినీ సురేఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హాస్టల్లో ఉన్న 82 మంది విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారిని సురేఖ, విస్తరణ అధికారి రామారావులు మాట్లాడుతూ, ఐదుగురు విద్యార్థులు రొంప, దగ్గుతో బాధపడుతున్నట్లు వారు తెలిపారు. హ్యాండ్ వాష్ చేసుకోవాలని, ఉతికిన దుస్తులను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ, హెచ్ వి ఎర్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోవిందు, ఏఎన్ఎం ప్రభావతి పాల్గొన్నారు.

అయోధ్య సెట్‌తో అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బీచ్‌లో అయోధ్య రామాలయ సెట్ వేసి అక్రమాలకు పాల్పడిన వారిపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను శిక్షించాలని కోరుతూ విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు లేఖ రాశారు. దానిలోని వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. విశాఖ బీచ్ రోడ్డులో అయోధ్య రామాలయ సెట్ వేసి ప్రజల నుండి వేల రూపాయలు అక్రమంగా వసూలు చేసిన ఘటన విశాఖ ప్రజలను నిర్ఘాంతపరిచిందన్నారు. ప్రజలు తమ జీవితాల అభద్రత నుంచి ఉపశమనం పొందేందుకు, దైవంపై భక్తి భావంతో ఈ అయోధ్య రామాలయ సెట్‌కు వస్తే నిర్వాహకులు దర్శనాలు, కల్యాణోత్సవాల పేరుతో వేల రూపాయలు దోపిడీ చేయడం పరమ దుర్మార్గమన్నారు. రాముడిని, అయోధ్య రామాలయాన్ని భక్తి పేరుతో ప్రజల సొమ్మును లూటీ చేయడానికి వాడుకోవడం ఆందోళనకరమన్నారు. ఈ దోపిడీ దందా వెనుక కొందరు బిజెపి నేతలు, ప్రజాప్రతినిధులు ఉన్నారని మీడియా కూడా తెలిపిందన్నారు. ఈ అక్రమాలకు భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానాన్ని దుర్వినియోగ పరిచినట్లు ఆ ఆలయ ఇఒ విశాఖ జిల్లా కలెక్టర్‌కు, పోలీస్ కమిషనర్‌కు, దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసారంటే అక్రమాలు తీవ్రత ఇట్టే అర్థం పడుతోందన్నారు. నగరంలో అత్యంత కీలక పర్యాటక కేంద్రం బీచ్ అని, నిరంతరం కొన్ని వేల మంది ప్రజలు బీచ్‌కు వస్తున్నారని, ఇంతటి కీలక ప్రాంతంలో అయోధ్య రామాలయ సెట్‌వేసి నిర్వాహకులు తీవ్ర అక్రమాలకు పాల్పుడుతుంటే జిల్లా అధికార యంత్రాంగం, దేవాదాయ శాఖ ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిడులకు తలొగ్గారా ? అక్రమార్కులతో చేతులు కలిపారా ? ఈ అక్రమాల వెనుక ఉన్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరన్నది విశాఖ ప్రజల ముందుంచాలన్నారు. అక్రమాలు జరగకుండా తగు నివారణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించండి



మల్కాపురం పాదయాత్రలో పాల్గొన్న జగ్గునాయుడు



అనకాపల్లిలో ప్రచారం చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి -ములగాడ: ప్రజలపై ఛార్జీల భారంమోపే విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం జివిఎంసి 58వ వార్డు ములగాడ, ఎదురువానిపాలెంలో సిపిఎం పాదయాత్రలో మాట్లాడుతూ," సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ. 8,927, త్రీఫేజ్ మీటర్‌కు రూ. 17,286 స్మార్ట్‌మీటర్ ధరను వినియోగదారుల నుంచి 93వాయిదాలలో ప్రతినెలా బిల్లులో వసూలు చేస్తారన్నారు. ముందస్తు రీఛార్జితో ఎపుడు డబ్బులు అయిపోతాయో తెలియక వినియోగదారులు ఇబ్బందులు పడే పరిస్థితులు తప్పవన్నారు. అంతేకాక వాడే సమయాలు, డిమాండ్‌ను బట్టి యూనిట్‌రేటు మార్చుతూ ప్రజలపై భారాలు వేసేందుకు అదానీ సంస్థకు స్మార్ట్‌మీటర్లను అప్పగించేశారని మండిపడ్డారు. సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి పైడిరాజు మాట్లాడుతూ శ్రీహరిపురం ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేసి ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ములగాడ, మారుతి జంక్షన్ వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి, ఇరువైపులా విద్యుద్దీపాలు వేయాలన్నారు. జోన్ నాయకులు కె. పెంటారావు, బూడి శ్రీను, నరేష్, సమీన్ రామకృష్ణ సుభాన్, రమణ, రాము రాజు, రాంబాబు, వెంకటేష్, దుర్గారావు పాల్గొన్నారు

సీతమ్మధార: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో 15వ వార్డు సీతమ్మధార, డాక్టర్స్ కాలనీ అపార్ట్మెంట్ ఏరియాలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి గోవింద్ నాయకులు శ్రీను, హరి, సూరి బాబు నాయుడు, సోములు పాల్గొన్నారు.

అనకాపల్లి : అదాని స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించడాన్ని అడ్డుకోవాలని సిపిఎం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఇంటింటికి ప్రచారంలో భాగంగా శుక్రవారం గవరపాలెంలోని ఎల్లపు వారి వీధి, కోటవీధి, పీల మల్లయ్య గారి వీధి, దాడి వారి వీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్‌ను వ్యాపరమయం చేసిందని పేర్కొన్నారు. కరెంటు సరఫరా అదానీ కంపెనీ లాంటి ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి పోతుందని, ఈ ప్రమాదాన్ని గుర్తించాలని ప్రజలకు వివరించారు. ఈ ప్రచారంలో ప్రజలు స్పందించి తమ ఇండ్లకు స్మార్ట్ మీటర్లను బిగించుకోమని వాటిని అడ్డుకుంటామని తెలియజేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన కరెంట్ ఆఫీస్ వద్ద భారీ ధర్నా జరుగుతుందని, అందురూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు గంటా శ్రీరాం, బి ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, పెంటకోట శ్రీనివాసరావు, బుగిడి నూక అప్పారావు, భీమరశెట్టి మహాలక్ష్మి నాయుడు, బుద్ధ బలం నాయుడు పాల్గొన్నారు.

యస్.రాయవరం:మండలంలో గుడివాడ శివారు కొత్త పోలవరం గ్రామంలో విద్యుత్ స్మార్ట్ మీటర్‌లను వ్యతిరేకిస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్‌లను బిగించినట్లయితే రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.రీఛార్జిలో డబ్బులు ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు మాత్రమే విద్యుత్ ఉంటుందన్నారు.గతంలో వైయస్ఆర్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ బిగిస్తే లాగిపారేమని మంత్రి నారా లోకేష్ ప్రకటించారని, ప్రస్తుతం బిగించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో కుమారి వెంకటలక్ష్మి, అమ్మజీ, రావులమ్మ, సీతామాలక్ష్మి రాజు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో నిరసన తెలుపుతున్న స్థానికులు

రోడ్డుపై భారీ రంధ్రం

ప్రజాశక్తి-గొలుగొండ :మండలం పుత్తడిగైరంపేట పంచాయతీ పిఎన్‌డి.పాలెం రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు వద్ద గల కల్వర్టు వద్ద భారీ రంధ్రం పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతుండటంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఆదమరిస్తే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకముందే స్పందించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో రంధ్రం

ధ్యానంతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-పాయకరావుపేట: ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం అవసరమని యోగద సత్సంగ సొసైటీ అఫ్ ఇండియా ఉపాధ్యక్షులు స్వామి స్మరణానంద గిరి తెలియచేశారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో విద్యార్థులతో మాట్లాడుతూ... విద్యార్థులు తమ లక్ష్య సాధనకు ఏకాగ్రత పెంపొందించుకోవడానికి ధ్యానం ఒక మార్గమని అయన సూచించారు.ధ్యానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, యోగద సత్సంగ ధ్యాన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ప్రతినిధులు

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ :క్వారీని రద్దు చేయాలని స్థానిక ఆర్డిఓ కార్యాలయం ముందు జి కోడూరు రైతులు, బాధితులు మూడు రోజులుగా నిరసన దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షకు శుక్రవారం సిపిఎం నాయకులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా దళితులు, రైతులు నిరసన దీక్ష చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. దీనిపై ఆర్డిఓ త్వరగా స్పందించాలని సిపిఎం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, క్వారీ తవ్వకాలతో జీడి మామిడి తోటలు నాశనం అవుతున్నాయని తెలిపారు.మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో స్వయంగా వచ్చి విచారణ చేస్తామని హామీ ఇవ్వాలన్నారు.మూడు రోజులగా ఆందోళన చేస్తుంటే కనీసం కన్నెత్తి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసానికి, వ్యవసానికి యోగ్యమైన ప్రాతాలలో మైనింగ్ కు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. మైనింగ్ బ్లాస్టింగ్‌తో ప్రమాదాలు సంబవిస్తే ఎవరు బాద్యులని ప్రశ్నించారు. ఇప్పటకే రైతుల భూములలో వ్యర్థాలు వేసి భూములను, పంటలను నాశనం చేసారన్నారు.. ఇప్పటికైనా అధికారులు తక్షణమే క్వారీ తవ్వకాల అనుమతులు రద్దు చేసి రైతుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయుకుడు ఈరెల్లి చిరంజీవి,బౌహుజన ఐక్యవేదిక నాయకులు బోట్టా నాగరాజు,అప్పారావు తదితరులు



నినాదాలు చేస్తున్న సిపిఎం, దళిత సంఘాల నేతలు